సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 29 । జూన్ । 2025



పని ఒత్తిడితో సతమతం 8లో

పని భారంతో సతమతం అవుతున్నామని, ప్రభుత్వం ఆలోచించాలని జిల్లా పంచాయతీ కార్యదర్శులు డీపీవోకు వినతిపత్రం ఇచ్చారు.

ఉష్ణోగ్రతలు

శనివారం

	గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	35.3/26.8
చోడవరం	34.4/26.8



సైన్స్ కళాశాలకు విరాళం

మద్దిలపాలెం: ఏయూ సైన్స్ కళాశాలకు జైపూర్ యువరాజా విశ్వేశ్వర చంద్రచూడ్ దేవ్ ప్రతి ఏటా లక్ష విరాళం ఇస్తామన్నారు.

వందేభారత్ నిర్వహణ డిపో

వైజాగ్‌లో..



డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

- అత్యాధునిక లైటింగ్ వ్యవస్థ, విశాలమైన ప్రాంగణంలో డిపో ఏర్పాటు
- విశాఖ రైల్వే స్టేషన్ ఆధునీకీకరణ పనులు ఇక వేగవంతం
- దువ్వాడ-పలాస మధ్య రైల్వే లైన్ల వెంట ఫెన్సింగ్
- మల్లివీడు వద్ద పీపీపీ పద్ధతిలో గతి శక్తి టెర్మినల్ ఏర్పాటు
- దక్షిణ కోస్తా రైల్వే జీఎం కార్యాలయం కోసం 3, 4 స్థలాల పరిశీలన
- 'సాక్షి'తో వాల్తేరు డివిజన్ డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

వందేభారత్ రైళ్ల నిర్వహణ కోసం విశాఖలో కోచింగ్ డిపో ఏర్పాటు చేయనున్నట్లు వాల్తేరు డివిజన్ రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్‌ఎం) లలిత్ బోహ్రా తెలిపారు. రైల్వే యార్డులో అత్యాధునిక లైటింగ్ వ్యవస్థ, విశాలమైన ప్రాంగణంలో డిపో నిర్మాణం జరగనుందని పేర్కొన్నారు. రైళ్ల నిర్వహణ పనుల విషయంలో జాప్యం లేకుండా ఉండేందుకు 24 గంటలు ఈ డిపో పనిచేస్తోందన్నారు. దువ్వాడలో వందేభారత్ రైళ్ల స్టాప్ పాయింట్ కోసం వచ్చే వారం ప్రధాన కార్యాలయానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు వివరించారు. అలాగే విశాఖ కేంద్రంగా ఏర్పాటవుతున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు జనరల్ మేనేజర్ నియామకం జరిగిందని, వారి కార్యాలయం కోసం 3, 4 ప్రాంతాలను తాత్కాలికంగా పరిశీలిస్తున్నామన్నారు. విశాఖ నుంచి దువ్వాడ వరకు కొత్త రైల్వే లైను పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్ పనులకు ఉన్న కోర్టు కేసుల అడ్డంకి తొలగిపోయిందని, ఇక పనులు వేగవంతం చేస్తామన్నారు. రైల్వే ప్రయాణికులకు సౌకర్యాలు మరింతగా మెరుగుపరిచే లక్ష్యంతోనే పనిచేస్తున్నామన్నారు. శనివారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇంకా ఏమన్నారంటే ఆయన మాటల్లోనే..

దువ్వాడ నుంచి పలాసకు రయ్.. రయ్!

దువ్వాడ నుంచి పలాస వరకు రైల్వే లైన్ల వెంట ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. ఇప్పటికే ఈ పనులకు టెండర్లు పూర్తయ్యాయి. సదరు కాంట్రాక్టరుకు లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌వోఐ) కూడా జారీచేశాం. రానున్న 12 నెలల్లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించాం. ఈ ఫెన్సింగ్ ఏర్పాటుతో రైళ్ల రాకపోకల సందర్భంగా ఎటువంటి ప్రమాదాలకు... రైల్వే లైన్ల క్రాసింగ్‌కు అవకాశం ఉండదు. తద్వారా రైళ్ల వేగాన్ని గంటకు 160 కిలోమీటర్ల వరకూ తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుంది. ఈ మార్గంలో రైళ్ల వేగాన్ని పెంచడం ద్వారా ప్రయాణికులు గమ్యాన్ని వేగంగా చేరుకునే అవకాశం ఉంటుంది.

రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు..!

కోర్టు కేసుతో రైల్వే స్టేషన్‌లో పనులు ముందుకు సాగలేదు. చివరకు కోర్టు కేసు గెలిచాం. పనులు ప్రారంభిస్తాం. మొత్తం 14 ప్లాట్‌ఫారంలను ప్రధాన బిల్డింగ్‌ను ప్రయాణికులు చేరేందుకు వీలుగా 72 మీటర్ల పొడవైన కాంకోర్స్ ఏర్పాటవుతుంది. ఇక్కడ ప్రయాణికులు సేదతీరేందుకు అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ఇప్పుడున్న ప్లాట్‌ఫారం సైజు కూడా పెరుగుతుంది. ఇక జ్ఞానాపురం వైపు స్టేషన్ నుంచి నేరుగా బయటకు వెళ్లేందుకు వీలుగా ప్లాట్‌ఫారంల నిర్మాణం ఉంటుంది. మల్టీ లెవల్ కారు పార్కింగ్ సదుపాయంతో పాటు ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. గత 8 నెలలుగా నిలిచిన పనులు పట్టాలెక్కనున్నాయి.

మల్లివీడు వద్ద గతి శక్తి టెర్మినల్..!

కొత్తవలస రైల్వే స్టేషన్ దాటిన తర్వాత గల మల్లివీడు రైల్వే స్టేషన్ వద్ద గతిశక్తి టెర్మినల్ (జీసీటీ) ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ మెకానికల్ హ్యాండ్లింగ్, వేర్ హౌసింగ్, ట్రక్ రిపేర్ సెంటర్, ఫ్యూయలింగ్ సెంటర్ ఏర్పాటుకానున్నాయి. మెకానికల్ హ్యాండ్లింగ్ ద్వారా రేకుల లోడింగ్, అన్‌లోడింగ్ వేగవంతం అవుతుంది. తద్వారా రేకుల అందుబాటు సమయం కూడా పెరుగుతుంది. తద్వారా రేకుల కొరత కూడా కొద్ది మేర తగ్గే అవకాశం ఉంటుంది. ఇందుకోసం మిగతా 8లో

కూటమి పాలన.. నయవంచన





క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పరిశీలకురాలు శోభా హైమావతి, మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, సమన్వయకర్తలు, ఇతర నేతలు

- 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' పేరిట కూటమి సర్కారును ఎండగడదాం
- క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' డౌన్‌లోడ్
- శాసనమండలి విపక్ష నేత బొత్స, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు
- అమర్‌నాథ్ అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం

సాక్షి, అనకాపల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి పార్టీలు చేసిన మోసాలను ప్రజల వద్ద ఎండగడదామని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. అలవి కాని ఎన్నో హామీలు గుప్పించి వాటిపై ఇంటింటికీ హామీలు, సంతకాలతో బాండ్లు పంపించి అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మండిపడ్డారు. శనివారం అనకాపల్లిలోని పెంటకోట కన్వెన్షన్ హాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బొత్స సత్య నారాయణ, కురసాల కన్నబాబు హాజరయ్యారు. ముందుగా మహానేత వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పరిశీలకురాలు శోభా హైమావతి, మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు తదితరులతో కలిసి వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఎన్నికల ముందు త్రికరణ శుద్ధితో అమలు చేస్తామని చెప్పి, ఇప్పుడు చెత్తబుట్టకే పరిమితం చేసిన మేనిఫెస్టోను 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' పేరిట క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి కూటమి పార్టీల మోసాలు ప్రజలకు వినిపిస్తామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అమలు గురించి చంద్రబాబు ఒకలా.. లోకేష్ మరోలా.. అధికారులు ఇంకోలా ఎవరికి తోచిన విధంగా వారు అబద్ధాలు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. ఉచిత బస్సు పథకం ఆగస్టు 15 నుంచి అంటున్నారు.. ఏ సంవత్సరం నుంచి అమలు చేస్తారో తెలియని పరిస్థితిలో ప్రజలున్నారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేదా రూ.3 వేల భృతి ఎప్పుడిస్తారో తెలీదు.. ఆడబిడ్డ నిధిని పీ-4కు లింక్ చేశామంటున్నారు.. టీడీపీ అధికారంలోకి ఎప్పుడు వచ్చినా మహిళలు, రైతులు మోసపోతూనే ఉంటారన్నారు. ధాన్యం కొనుగోలు డబ్బులు విడుదల చేయలేదన్నారు. ఇలాంటి శుష్క వాగ్దానాలను ఏ రాజకీయ పార్టీ భవిష్యత్తులో ఇవ్వకుండా 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' పేరిట ఎన్నికలకు ముందు వారిచ్చిన హామీలను, అధికారంలోకి వచ్చాక వారి మోసాలను ఎండగడదామన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలు గురించి ఎవరైనా ప్రశ్నిస్తే.. వారి తాటతీస్తామంటున్నారు.. పవన్ కల్యాణ్ అయితే మక్కలు విరగ్గొడతామంటున్నాడు.. ఇచ్చిన హామీ లు నెరవేర్చకపోతే ప్రజలే మీ మక్కలు విరగ్గొడతారని హెచ్చరించారు. అక్రమంగా కేసులు పెట్టి జైళ్లలో ఎంతమందిని పెడతావో పెట్టుకో.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు భయపడేదే లేదన్నారు.



క్యూఆర్ కోడ్ గురించి వివరిస్తున్న బొత్స

నిలదీద్దాం రండి

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఒక్కో ఇంటికీ రూ.2 లక్షల 40 వేలు జమ అవుతాయని చంద్రబాబు, పవన్ కల్యాణ్ నమ్మించారని, బాండు కూడా రాసిచ్చారని.. ఇప్పుడు వాటిపైనే నిలదీద్దామన్నారు. ఇటీవల ఒక పచ్చ పత్రికలో కొత్త పరిశ్రమలు వచ్చేస్తున్నాయంటూ పెయిడ్ ఆర్టికల్స్ మిగతా 8లో

బాండ్లపై సంతకం పెట్టారు.. ఇప్పుడేమంటారు?

ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు మాట్లాడుతూ.. ఉచిత బస్సు నుంచి గ్యాస్ సిలిండర్ వరకూ హామీలిచ్చి మహిళలను, అన్నదాత సుఖీభవ పేరిట రైతులను, నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరిట యువతను మోసగించారని మండిపడ్డారు. 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ మహిళలకు పింఛను ఇస్తామని ఇచ్చిన హామీ హుష్ కాకి అయిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఎటువంటి షరతులు లేకుండా..అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు ఇస్తామని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇద్దరూ సంతకం చేసి బాండ్లు ఇచ్చారన్నారు. అవేవీ నెరవేరక ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ఈ సమయంలో జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ వారి పక్షాన నిలబడి ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రతిపక్ష పాత్ర నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఐదు వారాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' పేరిట క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి కూటమి పార్టీల మోసాలు ప్రజలకు వివరిద్దామన్నారు.



మాజీ మంత్రి కురసాల కన్నబాబు

ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే..!

- వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళిక-2041 పునఃపరిశీలన మరూ
- అభ్యంతరాల కోసం జూలై 17 వరకు గడువు పొడిగింపు
- వాటిపై నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల సమక్షంలోనే పరిశీలన

8లో

బడి కష్టాలపై కదలిక



విద్యార్థులతో మాట్లాడుతున్న అనకాపల్లి డీఈవో అప్పారావునాయుడు, అల్లూరి జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు



సాలబొంగి గిరిజన గ్రామానికి కాలినడకన వెళుతున్న అల్లూరి, అనకాపల్లి జిల్లాల అధికారుల బృందం

- సొలబొంగి గ్రామాన్ని సందర్శించిన అల్లూరి, అనకాపల్లి జిల్లాల అధికారులు
- ప్రాణాలకు తెగించి ప్రయాణిస్తున్న విద్యార్థుల కష్టాలపై సాక్షి కథనాలకు స్పందన
- విద్యాశాఖ మంత్రి ఆదేశంతో ఐదు కి.మీ. కాలినడకన చేరుకున్న అధికారులు
- ఒకటి, రెండు తరగతి విద్యార్థులకు ఎన్‌ఆర్‌ఎస్‌టీసీ ద్వారా విద్యాబోధనకు ఆదేశాలు
- 3–5 తరగతుల విద్యార్థులను, బడిమానేసిన వారిని ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించేందుకు నిర్ణయం
- సొలబొంగికి పొక్లెయిన్‌తో తాత్కాలిక రహదారి చదును పనులు ప్రారంభం

దేవరాపల్లి: అనంతగిరి మండల పరిధిలోని పినకోట పంచాయతీ శివారు సొలబొంగి గిరిజన విద్యార్థులు చదువుల కోసం పడుతున్న ఇబ్బందులపై అధికారుల్లో కదలిక వచ్చింది. పడవలపై, బురద రోడ్డులో ప్రమాదకర ప్రయాణం చేస్తూ చదువులు సాగించడంపై సాక్షిలో 'ప్రాణాలకు తెగిస్తేనే పాఠాలు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. చిన్నారులు, వారి తల్లిదండ్రులు చేతులు జోడించి వేడుకుంటున్న చిత్రం కూడా సాక్షి ప్రధాన సంచికలో ప్రచురితమైంది. ఈ కథనాలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించారు. అక్కడి పరిస్థితిని స్వయంగా పరిశీలించి స్థానిక విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. వారి ఆదేశాలతో అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి జి.అప్పారావునాయుడు, అల్లూరి జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ లెఫ్టినెంట్ డా.వి.స్వామినాయుడు, రెండు జిల్లాలకు చెందిన అధికారులతో కూడిన బృందం శనివారం అటవీ ప్రాంతం గుండా బురదమయంగా మారిన రహదారి, పొలాల గట్ల మీదుగా 5 కిలోమీటర్ల దూరం నడిచి అతి కష్టం మీద సొలబొంగి గ్రామానికి చేరుకుంది. దూరదూరంగా ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని 13 మంది విద్యార్థులు అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం తామరబ్బ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతుండగా మరో నలుగురు అర్ధంతరంగా చదువు మానేసినట్లు గుర్తించారు. ఈ వివరాలను అక్కడి నుండే అల్లూరి జిల్లా కలెక్టర్‌కు సమగ్ర శిక్ష ఏపీసీ స్వామినాయుడు తెలియజేశారు.

పరిష్కారానికి తక్షణ నిర్ణయాలు

అల్లూరి కలెక్టర్ ఆదేశాలతో ఒకటి, రెండు తరగతులు చదువుతున్న 8 మంది అక్కడే చదువుకునే విధంగా ఎన్‌ఆర్‌ఎస్‌టీసీ (నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రెనింగ్ సెంటర్) ఏర్పాటు చేసి విద్యా వలంటీర్ ద్వారా విద్యాబోధన అందిస్తామని ఏపీసీ తెలిపారు. అలాగే 3 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న ఐదుగురు విద్యార్థులతోపాటు బడి మానేసిన నలుగురు విద్యార్థులను పినకోట, జీనబాడులోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ సంక్షేమ పాఠశాలలో చేర్పించనున్నట్లు తెలిపారు. వీరభద్రపేట నుంచి సొలబంగి వరకు తాత్కాలికంగా పొక్లెయిన్‌తో మట్టి రహదారి చదును చేసే పనులను గిరిజన సంక్షేమ శాఖ ఈఈ వేణుగోపాల్, ఏఈఈ గణేష్ దగ్గరుండి చేపట్టారు. అంతకు ముందు దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తామరబ్బ యూపీ స్కూల్‌ను సందర్శించారు. వీరి వెంట అనంతగిరి మండల ఏటీడబ్ల్యూవో కె.వెంకటరమణ, ఎంఈవో కె.బాలాజీ, దేవరాపల్లి మండల ఎంఈవోలు సిహెచ్.ఉమ, వి.ఉషారాణి, తామరబ్బ, పినకోట సర్పంచ్‌లు టోకురి రామకృష్ణ, ఎస్.గణేష్ ఉన్నారు.

మానవత్వం చాటిన డీఈవో

సొలబొంగి మారుమూల గిరిజన గ్రామంలో పర్యటించిన అనకాపల్లి డీఈవో జి.అప్పారావునాయుడు మానవత్వం చాటారు. సొలబొంగి గ్రామంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన గమ్మెల రమణను దత్తత తీసుకున్నారు. ఉన్నత చదువులకు తాను అండగా నిలుస్తానని భరోసా కల్పించారు.



దత్తత తీసుకున్న గిరిజన విద్యార్థి గమ్మెల రమణతో డీఈవో అప్పారావునాయుడు



సొలబంగిలో పొక్లెయిన్‌తో తాత్కాలికంగా చేపట్టిన రహదారి చదును పనులు

చోడవరంలో 63 అడుగుల మట్టి వినాయక విగ్రహం


విగ్రహం తయారీ సందర్భంగా పూజ చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ సాంబ


ఉత్సవం సందర్భంగా రాట వేస్తున్న భక్తులు

- నవరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

చోడవరం: నియోజకవర్గ కేంద్రం చోడవరంలో ఈ ఏడాది వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వయంభూ విఘ్నేశ్వరస్వామి దేవాలయం సమీపంలో హార్డింజ్ గెస్ట్ హౌస్ ఆవరణంలో 63అడుగుల మట్టి వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు శనివారం పూజా కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటి వరకూ గ్రామీణ జిల్లాలో ఇంత భారీ మట్టి విగ్రహాన్ని ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ఈ విగ్రహం ఏర్పాటు, ఇతర సెట్టింగ్‌లకు సుమారు రూ.25లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశారు. విగ్రహం తయారీకి రెండు నెలల సమయం పడుతుందని నిర్వాహకులు తెలిపారు. సద్భావన కమిటీ, చోడవరం కమ్యూనిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. పూజా కార్యక్రమాన్ని స్వయంభూ విఘ్నేశ్వర స్వామి దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు గూనూరు మల్లునాయుడు, కొప్పాక రాజేష్, గూనూరు పెదబాబు తదితరులుపాల్గొన్నారు.

ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే..!

- వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళిక-2041 పునఃపరిశీలన మరూ
- అభ్యంతరాల కోసం జూలై 17 వరకు గడువు పొడిగింపు
- వాటిపై నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల సమక్షంలోనే పరిశీలన
- ఈ నెల 30 నుంచి జూలై 17 వరకు సమీక్షలు
- కూటమి నేతలకు లబ్ధి చేకూరేలా ప్లాన్‌లో మార్పులకు కసరత్తు



విశాఖ సిటీ : అంతా అనుకున్నట్లే చేస్తున్నారు. విశాఖ బృహత్తర ప్రణాళిక-2041లో మార్పులు, చేర్పులకు సిద్ధమవుతున్నారు. కూటమి ప్రజాప్రతినిధుల సమక్షంలోనే ఈ తంతు పూర్తి చేసేందుకు ముహూర్తం పెట్టేశారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాల పరిశీలన పేరుతో తమ వారికి లబ్ధి చేకూర్చేందుకు పూనుకుంటున్నారు. ఇందుకోసం ఈ నెల 30వ తేదీ నుంచి జూలై 17వ తేదీ వరకు నియోజకవర్గాల వారీ ఆయా ఎమ్మెల్యేల సమక్షంలోనే అభ్యంతరాలపై సమీక్షించాలని నిర్ణయించారు. ఒకవైపు ఫిర్యాదులను పరిశీలిస్తున్నట్లు తేదీలు ఖరారు చేసినప్పటికీ.. అభ్యంతరాల స్వీకరణకు గడువు పొడిగించడం విశేషం. ఇందులో కూటమి 'రియల్ వ్యాపారానికి' అనుగుణంగా ప్లాన్‌లో సవరణలు చేసే అవకాశం ఉందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తోంది.

అభ్యంతరాల స్వీకరణకు గడువు పొడిగింపు

వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్-2041లో పునఃపరిశీలన పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని ఉత్తర్వులు జారీ చేసింది. మే 22వ తేదీ నుంచి ఈ నెల 21వ తేదీ వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో కేవలం 755 మాత్రమే అభ్యంతరాలు వచ్చాయి. వాస్తవానికి వేల సంఖ్యలో ఫిర్యాదులు వస్తాయని కూటమి ప్రజాప్రతినిధులు భావించారు. ఆ సంఖ్యను అడ్డుపెట్టుకుని ఇప్పటికే సిద్ధమైన మాస్టర్‌ప్లాన్-2041పై ఆరోపణలు గుప్పించాలని నిర్ణయించారు. కానీ నామమాత్రంగానే అభ్యంతరాలు రావడంతో కూటమి నేతలు కంగుతిన్నారు. దీంతో ఈ అభ్యంతరాల స్వీకరణ గడువు మరోసారి పొడిగించారు. జూలై 17వ తేదీ వరకు ఫిర్యాదులు చేయవచ్చని తాజాగా ప్రకటించారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయానికి, ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు ఎక్కువగా రాకపోవడంతో ఆయా జిల్లాల రెవెన్యూ కార్యాలయాల్లో కూడా ప్రజల నుంచి అభ్యంతరాలు తీసుకోవడానికి ఏర్పాట్లు చేశారు. అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట తదితర ప్రాంతాల వారి సౌలభ్యం కోసమంటూ అనకాపల్లి ఆర్డీవో కార్యాలయంలో అభ్యంతరాలను ఈ నెల 30, జూలై 1వ తేదీల్లో స్వీకరించనున్నారు. అలాగే ఎస్.కోట, చీపురుపల్లి, విజయనగరం, గజపతినగరం, నెల్లిమర్ల ప్రాంతాల వారు విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో జూలై 14, 15 తేదీల్లో ఫిర్యాదులను అందించే అవకాశం కల్పించారు.

పరిశీలనలో సిఫార్సులకే పెద్ద పీట?

మాస్టర్‌ప్లాన్ కోసం వచ్చిన అభ్యంతరాల పరిశీలనకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎమ్మెల్యేల సమక్షంలోనే వీటి పరిశీలనకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి జూలై 17వ తేదీ వరకు నియోజకవర్గాల వారీగా అభ్యంతరాలను పరిశీలించనున్నారు. నిర్ణీత తేదీ, సమయాల్లో ఎమ్మెల్యేలతో పాటు ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటామని చెబుతున్నప్పటికీ.. ఆ పరిస్థితి ఉండదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జూలై 16, 17 తేదీల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వీఎంఆర్‌డీఏ కార్యాలయం 3వ అంతస్తులో మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అభ్యంతరాలను స్వీకరించనున్నారు. కేవలం కూటమి ప్రజాప్రతినిధులు, వారి అనుచరుల రియల్ వ్యాపారానికి లబ్ధి చేకూర్చడమే లక్ష్యంతో మాస్టర్‌ప్లాన్‌లో సవరణకు సిద్ధమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అభ్యంతరాల పరిశీలన ఇలా..

తేదీ	నియోజకవర్గాలు	సమయం	వేదిక
జూన్ 30, జూలై 1	అనకాపల్లి, పాయకరావుపేట, యలమంచిలి	11 నుంచి 5 వరకు	అనకాపల్లి ఆర్డీఓ ఆఫీస్
జూలై 3, 4	పెందుర్తి గాజువాక	11 నుంచి 5 వరకు	వీఎంఆర్‌డీఏ ఆఫీస్
జూలై 7, 8	విశాఖ ఉత్తర, పశ్చిమ, దక్షిణ	11 నుంచి 5 వరకు	వీఎంఆర్‌డీఏ ఆఫీస్
జూలై 10,11	విశాఖ తూర్పు, భీమిలి	11 నుంచి 5 వరకు	వీఎంఆర్‌డీఏ ఆఫీస్
జూలై 14, 15	ఎస్.కోట, విజయనగరం, గజపతినగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి	11 నుంచి 5 వరకు	విజయనగరం కలెక్టరేట్

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు


జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు స్పీకర్ సీహెచ్.అయ్యన్నపాత్రుడు తెలిపారు. మున్సిపాలిటీలో శానిటేషన్ నిర్వహణకు రూ.85 లక్షలతో కొనుగోలు చేసిన కాంపాక్టర్, రెండు ట్రాక్టర్లను స్పీకర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా ట్రాక్టర్‌ను నడిపారు.అనంతరం మాట్లాడుతూ ఉత్తరవాహిని వద్ద డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి చెత్తను తరలించే చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిందాల్ సంస్థకు ఇప్పటి వరకు 400 టన్నుల చెత్తను తరలించామని, ఆ సంస్థ విద్యుత్ తయారీలో దీనిని వినియోగిస్తుందని చెప్పారు. కాలువల్లో చెత్త తొలగింపునకు పొక్లెయిన్, రూ.52 లక్షలతో కాంపాక్టర్, రూ.30 లక్షలతో రెండు ట్రాక్టర్లు, రూ.8 లక్షలతో తోపుడుబండ్లు, డస్ట్‌బిన్‌లు కొనుగోలు చేసినట్టు చెప్పారు. 1,750 వీధి లైట్లు ఏర్పాటు చేశామన్నారు. చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, ఆర్డీవో వి.వి.రమణ, కౌన్సిలర్ సీహెచ్.పద్మావతి, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, తహసీల్దార్ రామారావు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

చీటీల పేరుతో మోసం..టీడీపీ నేతపై కేసు


నిందితుడు, టీడీపీ నేత దాడిశెట్టి పైడియ్య (నానాజీ)

యలమంచిలి రూరల్: చీటీలు,అధిక వడ్డీల ఆశచూపి పలువురి వద్ద భారీగా డబ్బు వసూలు చేసి, మోసం చేసినట్టు అందిన ఫిర్యాదు మేరకు యలమంచిలి మున్సిపాలిటీ పరిధి తెరువుపల్లికి చెందిన టీడీపీ నాయకుడు దాడిశెట్టి పైడియ్య(నానాజీ)పై యలమంచిలి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. చీటీల ద్వారా 116 మంది రూ.64 లక్షలు మోసపోయినట్టు బాధితుడు తేటకలి భూషణరావు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు కేసు నమోదైంది. నిందితుడు పైడియ్య బాధితులు భారీగానే ఉన్నట్టు తెరువుపల్లి గ్రామస్థులు చెబుతున్నారు.గ్రామంలో పాలసంఘంలో వేతన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేయడంతో తెరువుపల్లి,చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆయనను బాగా నమ్మి రూ.3కోట్లకు పైగా అప్పుగా ఇచ్చారు. ఇటీవల నిందితుడు కుటుంబంతో సహా గ్రామం నుంచి పరారవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరుతున్నారు.పరారైన నిందితుడు దాడిశెట్టి పైడియ్య(నానాజీ) కోసం పోలీసులు గాలిస్తున్నారు.అతని ఫోన్ కాల్స్ డేటాను పరిశీలిస్తున్నారు.

వందేభారత్ నిర్వహణ డిపో వైజాగ్‌లో

7వ పేజీ తరువాయి

ఇప్పటికే టెండర్లను ఆహ్వానించాం. ఆగస్టులో టెండర్ దాఖలుకు గడువు ఉంది. ఇది పూర్తిగా రైల్వే స్థలంలోనే ఏర్పాటు కానుంది.

శాటిలైట్ స్టేషన్లుగా మరింత అభివృద్ధి..!

విశాఖ రైల్వే స్టేషన్ నుంచి ప్రస్తుతం రోజూ 50 వేల మంది వరకూ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. రైల్వే లైన్లు తక్కువగా ఉండటం వల్ల రైళ్ల వేగం కూడా దువ్వాడ నుంచి తగ్గుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొత్త రైల్వే లైన్ల పనులు సాగుతున్నాయి. 3, 4 రైల్వే లైన్ల పనులు జరుగుతున్నప్పటికీ.. భవిష్యత్ అవసరాల నేపథ్యంలో దువ్వాడ, పెందుర్తి శాటిలైట్ స్టేషన్లుగా మరింత అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉంది. తద్వారా విశాఖ రైల్వే స్టేషన్‌పై భారం తగ్గుతుంది. ఇప్పటికే దువ్వాడ స్టేషన్‌లో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. పెందుర్తి స్టేషన్‌లోనూ అభివృద్ధి పనులు చేపడతాం.

దువ్వాడలో వందేభారత్ స్టాప్ కోసం ప్రతిపాదనలు

ప్రస్తుతం వైజాగ్-సికింద్రాబాద్ మధ్య రెండు వందే భారత్ రైళ్లు సేవలందిస్తున్నాయి. ప్రయాణికుల నుంచి వీటికి మంచి డిమాండ్ ఉంది. ఈ రెండు రైళ్ల నిర్వహణ సికింద్రాబాద్‌లోని డిపోలో జరుగుతోంది. విశాఖలో ఈ రైళ్ల నిర్వహణ కోసం డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో ఈ డిపో పనులు ప్రారంభించాలని నిర్ణయించాం. అదేవిధంగా ఈ రైళ్లను దువ్వాడ స్టేషన్‌లోనూ నిలపాలనే డిమాండ్ ప్రయాణికుల నుంచి ఉంది. దీనిపై వచ్చే వారం ప్రధాన కార్యాలయానికి ప్రతిపాదనలు పంపుతాం. అక్కడి నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

కూటమి పాలన.. నయవంచన

7వ పేజీ తరువాయి

రాయించుకున్నారని, ఒక్క పరిశ్రమైనా వచ్చిందా అని ప్రశ్నించారు. రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 8 లక్షలు ఉద్యోగాలు ఇచ్చామని అవాస్తవాలు రాయించుకుంటున్నారని, ప్రజలకు వాస్తవాలు తెలుసన్నారు. పొదిలి, పల్నాడు, గుంటూరు పర్యటనల్లో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న ఆదరణ చూస్తే కూటమి ప్రభుత్వానికి దడ పుడుతోందన్నారు. వచ్చే ఏడో తేదీ నాటికి అన్ని నియోజకవర్గాలల్లో విస్తృత స్థాయి సమావేశాలు పూర్తి చేయాలన్నారు.

ఏడాది పాలనపై తీవ్ర వ్యతిరేకత

మాజీ డిప్యూటీ సీఎం, పీఏసీ సభ్యుడు బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ.. కూటమి పార్టీల మోసపూరిత హామీలు నమ్మి మోసపోయామని ప్రజలంతా ఇప్పటికే పశ్చాత్తాపానికి గురవుతున్నారని చెప్పారు. ఏడాదిలోనే ప్రభుత్వంపై పెద్దస్థాయిలో వ్యతిరేకత వచ్చిందన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో సామాన్యులు నిత్యావసర వస్తువుల ధరల నుంచి భూమి రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు వరకు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళలకు భద్రత లేదు.. చిన్నారులపై అఘాయిత్యాలు, అత్యాచారాలు పెచ్చుమీరాయన్నారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పార్లమెంట్ పరిశీలకులు శోభాహైమావతి మాట్లాడుతూ.. మూడు పార్టీలు ఆరు గ్రూపులుగా కూటమి పాలన సాగుతోందని, ఇసుక నుంచి గ్రావెల్, మద్యం వరకు అన్నీ దోచుకుంటున్నారన్నారు. సమన్వయకర్తలు పెట్ల ఉమాశంకర్ గణేష్, కంబాల జోగులు, కన్నబాబురాజు, మలసాల భరత్‌కుమార్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పార్లమెంట్ పరిశీలకులు సూర్యనారాయణరాజు, బొడ్డేడ ప్రసాద్, వ్యవసాయ సలహామండలి మాజీ చైర్మన్ చిక్కాల రామారావు, ముఖ్యనేతలు దంతులూరి దిలీప్‌కుమార్, చింతకాయల సన్యాసిపాత్రుడు, ఈర్లె అనురాధ, మిలటరీనాయుడు, రుత్తల యర్రాపాత్రుడు, మందపాటి జానకీ రామరాజు, గొర్లి సూరిబాబు, జాజుల రమేష్, పుల్లేటి వెంకటేష్, పాలిశెట్టి సురేష్‌రాజు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వార్డు ఎమినిటీస్ కార్యదర్శుల ధర్నా

అనకాపల్లి: విశాఖ ఉమ్మడి జిల్లాలో సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో నిబంధనలు పాటించలేదని, పారదర్శకత లోపించిందని ఆరోపిస్తూ వార్డు ఎమినిటీస్ కార్యదర్శులు శనివారం విశాఖ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో అవకతవకలు జరిగాయని వారు ఆరోపించారు. పలువురు సచివాలయ ఉద్యోగులు నిరసనలో పాల్గొన్నారు.

పని ఒత్తిడితో పంచాయతీ కార్యదర్శులు సతమతం

తుమ్మపాల: గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణ, క్లోరినేషన్‌తో మొదలు పెట్టి రకరకాల సర్వేలు, ప్రజల అవసరాలు, గ్రామ అభివృద్ధి పనులతో తీరిక లేకుండా పనిచేస్తూ తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నామని జిల్లా పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు శనివారం జిల్లా పంచాయతీ అధికారి సందీప్‌కు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి అనేక రకాల పనులతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని, స్వర్ణ పంచాయతీ పనులు, ఇంటి పన్నుల వసూళ్లు, గ్రామ సచివాలయ సర్వేలు, రెవెన్యూ పనులు, గ్రామసభలు, సమావేశాలు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ఎన్నికల విధులు, ప్రొటోకాల్ విధులు, ఇలా చాలా రకాల పనులు చేస్తున్నామని, చెత్త సేకరణ చేసి ఫొటోలు కూడా అప్‌లోడ్ చేయాల్సిన దుస్థితిలో ఉద్యోగాలు చేస్తున్నామన్నారు. ఒత్తిడి తట్టుకోలేక పంచాయతీ కార్యదర్శులు అనారోగ్యం పాలవుతున్నారని, ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుని,న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించారు.

ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు

మద్దిలపాలెం: ఏయూ నిర్వహిస్తున్న బీఎస్సీ హానర్స్, ఎంఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో 40 మందికి ప్రవేశాలు కల్పిస్తామని, ఏడాదికి రూ.65 వేలు కోర్సు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

గొలుగొండ: మండలంలోని పప్పుశెట్టిపాలెం ప్రాంతంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురానికి చెందిన షేక్ బాషా(53) కృష్ణదేవిపేట నుంచి నర్సీపట్నానికి బైక్‌పై వెళుతున్న సమయంలో పప్పుశెట్టిపాలెం వద్ద ప్రమాదానికి గురి కావడంతో తలకు బలమైన గాయమై మృతి చెందినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. మృతదేహానికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్టు ఆయన చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జగన్నాథుని ఉచిత దర్శనం గంటసేపే




ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకే ఉచిత దర్శనం కల్పిస్తున్నట్టు పెట్టిన బ్యానర్


గూడ్స్‌రోడ్‌లో ఇంద్రద్యుమ్న హాల్

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గూడ్స్‌రోడ్‌లోని ఇంద్రద్యుమ్న హాల్‌లో కొలువుదీరిన జగన్నాథ స్వామి దర్శనాన్ని భక్తులకు కల్పించే విషయంలో అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు స్వామి దర్శనాన్ని భక్తులకు కల్పిస్తుండగా ఇందులో కేవలం గంటసేపు ఉదయం 6 గంటల నుంచి ఏడు గంటల వరకూ మాత్రమే ఉచిత దర్శనం కల్పించి, మిగతా రోజంతా రుసుం వసూలు చేస్తుండడంతో అధికారులపై భక్తులు మండిపడుతున్నారు. రూ.20, రూ.30 టిక్కెట్‌పై దర్శకల్పిస్తుండడంతో పేద భక్తులు ఇబ్బందులకు గురతున్నారు. ఏటా తొమ్మిది రోజుల పాటు జగన్నాథ స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. గవరపాలెం అగ్గిమర్రి చెట్టు వద్ద ఉన్న జగన్నాథ స్వామి దేవస్థానంలో వేంచేసిన జగన్నాథస్వామి, బలభద్రుడు, సోదరి సుభద్రతో కలిసి ఏటా ఉత్సవాల సందర్భంగా గూడ్స్ రోడ్ వద్ద ఇంద్రద్యుమ్న హాల్‌లో దశావతారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఆలయం ప్రాంగణంలో పలు చిరువ్యాపారులు వివిధ ఆట బొమ్మల షాపులను ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంతంలో పండగ వాతావరణం నెలకొంది. జగన్నాథుని దర్శించుకోవడానికి పట్టణం నుంచే కాకుండా వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కుటుంబ సమేతంగా భక్తులు వస్తుంటారు. దీంతో ఆలయానికి భారీగానే ఆదాయం సమకూరుతుంది. పెద్ద ఆలయాల్లో సైతం వీఐపీ దర్శనం, ప్రత్యేక దర్శనాలతో పాటూ రోజంతా ఉచిత దర్శనం ఏర్పాటు చేస్తారు. కానీ అందుకు భిన్నంగా పెద్దగా భక్తులు రాని సమయంలో ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు మాత్రమే ఉచిత దర్శనం ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయిలో ఉచిత దర్శనం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

272 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు


మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: జిల్లాలో ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ప్రారంభమైందని, రైతులు సాగుకు పొలాలను సిద్ధం చేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. శనివారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలతో టీఅండ్‌వీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే, జూన్ నెలల సాధారణ వర్షపాతం 231 మిల్లీ మీటర్లకు గాను ఇప్పటివరకూ 272 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని చెప్పారు. 18 శాతం వర్షపాతం కురిసినట్టు ఆయన తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖ డీఏవో ప్రతినిధి సీహెచ్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు ఆశించిన వర్షపాతం నమోదైనందున రైతులు పెద్ద ఎత్తున పచ్చిరొట్ట పంటలైన జనుము, పిల్లిపెసర విత్తనాలను విత్తుకున్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన వరి, నూనె గింజలు, సజ్జ విత్తనాలను పెద్ద ఎత్తున సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు పి.వి.కె.జగన్నాథరావు, టి.శ్రీలత, శాస్త్రవేత్తలు ఎం.విశాలాక్షి, బి.భవాని, ఆర్.సరిత డి.ఉమామహేశ్వరరావు, వ్యవసాయశాఖ ఏడీఏలు, ఉద్యాన శాఖ ఏడీఏలు తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

అనకాపల్లి ఎస్‌డీఏవోగా సుబ్రహ్మణ్యం



అనకాపల్లి: స్థానిక సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడిగా సీహెచ్. సుబ్రహ్మణ్యం శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా ఈయన పాడేరు నుంచి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన రామారావు శ్రీకాకుళం జిల్లా పలాస బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో అనకాపల్లి, కశింకోట, మునగపాక, సబ్బవరం, పరవాడ మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసుకునేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

భూ సమస్య పరిష్కారానికి చర్యలు



ఎంపీడీవో రవికుమార్‌కు అర్జీ అందజేత

కశింకోట: మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశానికి భూ సమస్యకు సంబంధించి జి.సింగవరం నుంచి ఒక అర్జీ వచ్చింది. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ సమావేశం నిర్వహించారు. అర్జీని పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఎంపీడీవో వి.వి. రవికుమార్, ఎస్‌ఐ కె. లక్ష్మణరావు, రెవెన్యూ సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

హైవేపై నో పార్కింగ్

కశింకోట: జాతీయ రహదారిపై వాహనాలను పార్కింగ్ చేయొద్దని ఎస్‌ఐ కె. లక్ష్మణరావు ఆదేశించారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకుగాను వాహనాలు నిలపకుండా శనివారం సాయంత్రం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వాహన డ్రైవర్లకు అవగాహన కలిగించారు. పెట్రోల్ బంకుల్లోను, బే ప్రాంతం, ఖాళీ స్థలాల్లో తప్ప జాతీయ రహదారిపైన, పక్కన వాహనాలను పార్కింగ్ చేయొద్దని సూచించారు. హైవేపై ప్రమాదాల నివారణకు వాహన చోదకులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఎస్‌ఐ రవికుమార్

అనకాపల్లి టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు రూరల్ ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం రాత్రి పిసినికాడ, శంకరం జాతీయ రహదారిపై లారీ, ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జాతీయ రహదారిపై జరుగుతున్న వరుస ప్రమాదాల దృష్ట్యా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 99 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	5,030	5,030
రెండో రకం	3,600	3,600
మూడోరకం	2,500	3,380

అనకాపల్లి సినిమాలు

భైరవం	:రాజా
కన్నప్ప	:సత్యనారాయణస్క్రీన్-1
8 వసంతాలు	:సత్యనారాయణ స్క్రీన్-2
కుబేరా	:పర్తిసాయి
సితారే జమీన్ పర్	:షిర్డీసాయి
చంద్రేశ్వర	:వెంకటేశ్వర
కట్టప్ప జడ్జిమెంట్	:శ్రీసత్య
మోర్గన్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 66 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 15 యూనిట్లు, బీ పాజిటివ్ -14, ఓ పాజిటివ్ -34, ఏబీ పాజిటివ్ -3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్(9703619706)ను ఫోన్లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 410 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 346 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

అటకెక్కిన హామీ

- అనకాపల్లి–చోడవరం రోడ్డుపై కన్నెత్తి చూడని ఎంపీ, ఎమ్మెల్యే
- దారి పొడవునా గోతులమయం
- గోతుల్లో వర్షపు నీరు చేరి ఇబ్బందులు
- మరమ్మతులకు గురవుతున్న వాహనాలు
- తరచూ రోడ్డు ప్రమాదాలు



అనకాపల్లి మండలంలో మామిడిపాలెం రహదారి



అనకాపల్లి మండలంలో బవులవాడ రహదారి

అనకాపల్లి: అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కూటమి పాలకుల హామీ నెరవేరలేదు. గెలిచిన రెండు నెలల్లో అనకాపల్లి–చోడవరం రోడ్డును అభివృద్ధి చేస్తామని, లేదా తాత్కాలికంగా ప్యాచ్ వర్కు చేస్తామని సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హామీ ఇచ్చారు. ఇంతవరకూ వీరు రోడ్డు వైపు కన్నెత్తి చూడటం లేదు. దాంతో స్థానికులకు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

శిథిలావస్థలో రోడ్డులో ప్రమాదాలు

మండలంలో తుమ్మపాల నుంచి మామిడిపాలెం వెళ్లే చోడవరం రహదారి పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరుకుంది. పెద్ద గోతులతో మృత్యు మార్గంగా మారింది. అనకాపల్లి నుంచి చోడవరం మీదుగా ఏజెన్సీకి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. అనకాపల్లి, చోడవరం, దేవరాపల్లి, మాడుగుల మండలాలతో పాటు పాడేరు, అరకు, జోలాపుట్, జి.మాడుగుల, ఒడిశా ప్రాతాలకు ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగిస్తున్నారు. దీన్ని బాగు చేయకపోవడంతో ఇప్పటికే ఈ రహదారిలో వేలాది వాహనాలు మరమ్మతులకు గురయ్యాయి. పలువురు ద్విచక్ర వాహనదారులు క్షతగాత్రులుగా మిగిలిపోయారు.

వర్షాల సమయంలో తిప్పలు

ఈ మార్గంలో మండలంలో తుమ్మపాల నుంచి మామిడిపాలెం రహదారిలో పెద్ద గోతులు ఉండడంతో వర్షపునీరు చేరి పూర్తిగా చెరువును తలపిస్తుంది. అయినప్పటికీ ప్రయాణం సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో అనకాపల్లి నుంచి చోడవరం మధ్య రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు.

క్వారీలు ఎక్కువ కావడంతో..

అనకాపల్లి మండలంలో మార్టూరు, బవులువాడ, దర్జీనగర్, మామిడిపాలెం, పాపయ్యసంతపాలెం గ్రామాల్లో ఎక్కువగా క్వారీలు ఉన్నాయి. వీటి నుంచి రోజుకు సుమారుగా వెయ్యి లారీలు అనకాపల్లి నుంచి అచ్యుతాపురం, రాంబిల్లి, యలమంచిలి, పరవాడ, విశాఖ ప్రాంతాలకు నిత్యం వెళ్లడంతో రహదారి శిథిలావస్థకు చేరుకుంది. పలు గ్రామాల నుంచి తుమ్మపాల పంచాయతీ పరిధిలో బొజ్జన్న కొండ మీదుగా జిల్లాలో ఇతర ప్రాంతాలకు క్వారీ లారీలు రేయింబవళ్లు ప్రయాణిస్తున్నాయి. రాత్రి సమయంలో అనకాపల్లి పట్టణం నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి.

పాడైన బొజ్జన్నకొండ రహదారి

క్వారీ లారీలు ఎక్కువగా బొజ్జన్న కొండ రహదారి మీదుగా అధిక లోడుతో ప్రయాణించడం వల్ల ఇటీవల కాలంలో మరమ్మతులకు గురైంది. దాంతో దేశంలో ఇతర ప్రాంతాల నుంచి అనకాపల్లి మండలం బొజ్జన్నకొండకు వచ్చే పర్యాటకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

దుమ్ము, ధూళితో ఇబ్బందులు

మండలంలో బవులవాడ, దర్జీనగర్, తుమ్మపాల, మార్టూరు గ్రామాల రహదారులు శిథిలావస్థకు చేరుకున్నాయి. స్థానిక యువత కొద్దిపాటి క్రషర్ బుగ్గతో గోతులను పూడ్చారు. వాహనాలు వెళ్తున్న సమయంలో క్రషర్ బుగ్గ కారణంగా దుమ్ము, ధూళి రేగి ప్రజలు ఇబ్బందులు పడి రోగాల బారిన పడుతున్నారు.

రహదారిని అభివృద్ధి చేయాలి



కూటమి ప్రభుత్వం రహదారులను అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమైంది. ప్రజలు, వాహనదారుల ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని అనకాపల్లి–చోడవరం రహదారిని తక్షణమే అభివృద్ధి చేయాలి.
– రాపేటి వెంకటేశ్వరరావు, తుమ్మపాల గ్రామం, అనకాపల్లి

క్వారీ లారీలపై చర్యలు తీసుకోవాలి



మండలంలో క్వారీ లారీలు అధిక లోడుతో ప్రయాణిస్తున్నాయి. వీటిపై చర్యలు తీసుకోవాలి. అనకాపల్లి–చోడవరం రోడ్డు అభివృద్ధి చేసేముందు రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి. వర్షాలు పడకముందే అధికారులు చర్యలు తీసుకుని రహదారిని బాగుచేయాలి.
– కె.ఎం.నాయుడు, అనకాపల్లి

ధ్యాన వేంకటేశ్వరస్వామికి అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వర స్వామి అందమైన అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. ఆషాఢ మాసం మొదటి శనివారం పురస్కరించుకొని స్వామివారిని పూలమాలలు, తులసీమాలలతోపాటు వజ్ర కవచాలంకృతులతో అలంకరించారు. విష్ణు సహస్ర నామాలతో స్వామిని అర్చించారు. ప్రత్యేక పూజలు చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. భక్తులు ఎక్కువగా దర్శించారు.

నేడు యాదవ విద్యార్థులకు పురస్కారాలు



సోమునాయుడు

కశింకోట: జిల్లాలో టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ చాటిన యాదవ విద్యార్థులకు పురస్కారాలు అందివ్వనున్నట్లు జిల్లా యాదవ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కరక సోమునాయుడు తెలిపారు. అనకాపల్లిలోని సత్యాస్ లక్ష్మీ గ్రాండ్ ఫంక్షన్ హాలులో ఆదివారం ఉదయం పది గంటలకు ఈ కార్యక్రమాన్ని జిల్లా సంఘం అధ్యక్షుడు బర్నికాన బాబూరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో 550 మార్కులు, ఇంటర్‌లో 900 మార్కులు, అంతకంటే పైగా సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించనున్నామన్నారు. జిల్లాలోని వివిధ పార్టీల నాయకులు, ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. జిల్లాలోని యాదవ కుటుంబాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు



జమాదులపాలెంలో నట్టల నివారణ మందు వేస్తున్న పశు వైద్యాధికారి చైతన్యమణి



ఏఎస్ పేటలో నట్టల నివారణ మందు అందజేత

కశింకోట: మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు వేయడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని కశింకోట పశు వైద్యాధికారి చైతన్యమణి తెలిపారు. మండలంలోని జమాదులపాలెంలో నట్టల నివారణకు వంద గొర్రెలు, 300 మేకలకు శనివారం ఉచితంగా మందు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నట్టల నివారణ మందు వల్ల జీవాలు బలవర్థకంగా ఎదిగి మాంసం, ఉన్ని దిగుబడి, నాణ్యత పెరుగుతుందన్నారు. పిల్లల్లో మరణాల సంఖ్య తగ్గుతుందన్నారు. వచ్చే నెల పదో తేదీ వరకు గ్రామాల వారీగా నట్టల మందు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఏఎస్ పేట, నరసాపురం గ్రామాల్లో 235 గొర్రెలు, 430 మేకలకు నట్టల నివారణ మందు వేశారు. నరసింగబిల్లి పశు వైద్యాధికారి అల్ఫోన్సా జార్జ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



బయ్యవరంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట: ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో వి.వి. రవికుమార్ కోరారు. మండలంలోని బయ్యవరంలో ఆయన శనివారం పర్యటించారు. అక్కడ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు నిర్దేశిత ప్రాంతాల్లో చెత్త వేయాలన్నారు. చెత్తను పారిశుధ్య సిబ్బంది రిక్షాతో వచ్చినప్పుడు అందించాలన్నారు. క్రమం తప్పకుండా పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అక్కడి సంపద కేంద్రం పనితీరును పరిశీలించారు. తర్వాత ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి కూలీలతో మమేకమయ్యారు. ఉపాధి పనులకు సకాలంలో హాజరై నిర్దేశించిన పని పూర్తి చేసి కూలి పొందాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సింహగిరి ప్రసాదాల తయారీ శాల పరిశీలన



అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఈవీ త్రినాథరావు

సింహాచలం: సింహగిరిపై ప్రసాదాల తయారీకి నూతన శాల నిర్మాణానికి శనివారం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు స్థల పరిశీలన చేశారు. ప్రస్తుతం అన్న ప్రసాద భవనంపై అంతస్తుని ప్రసాదాల తయారీ వంటశాలతో పాటు లడ్డూలు చుట్టేందుకు, పులిహోర పంపిణీకి వినియోగిస్తున్నారు. దీంతో కింది అంతస్తులో భక్తులు అన్నప్రసాదం స్వీకరించేందుకు సరిపోవడం లేదు. ఈ తరుణంలో కొత్తగా భవనం నిర్మించి అందులోకి ప్రసాదాల తయారీ, ప్యాకింగ్ సెక్షన్లను మార్పు చేసేందుకు కొన్నిరోజుల కిందట ప్రణాళిక వేశారు. ఈ మేరకు భవనం నిర్మించేందుకు అనువైన స్థలం కోసం ఈవో అధికారులతో కలిసి పరిశీలన చేశారు. త్వరలోనే కొత్త భవనం నిర్మిస్తామని తెలిపారు. అన్నప్రసాద భవనంలో భక్తులకు అందుతున్న సేవలను పరిశీలించారు. భక్తులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా మాట్లాడాలని ఆదేశించారు. లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్యూలో వేచి ఉన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు నాణ్యతతో కూడిన భోజనం అందించాలని తెలిపారు. వంట పదార్థాలు తయారు చేసేటప్పుడు నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దేవస్థానం ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి, పి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి డీఈ హరి, ఏఈ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ.. దేశ చరిత్రలో చీకటి రోజు



మాట్లాడుతున్న బీవీకే కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ సత్యారావు

మునగపాక: ఆనాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీ విధించి ప్రజలను ఇబ్బందులకు గురి చేసిందని విశాఖ బీవీకే కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ వై.సత్యారావు తెలిపారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో శనివారం స్థానిక నేషనల్ డిగ్రీ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీని వ్యతిరేకించిన విద్యార్థులపై పలు కేసులు పెట్టి హింసించిందన్నారు. విలేకరులను బెదిరించి ప్రింటింగ్ ప్రెస్‌లకు సైతం కరెంటు లేకుండా చేసిందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, మళ్ల కాలేశ్వరరావు, బద్దెం సూర్యనారాయణ, యల్లపు రాజేశ్వరరావు, బొడ్డేడ భాస్కరరావు, మళ్ల మల్లయ్యనాయుడు, నరసింగరావు, కన్నప్పారావు, నాగ భూషణం తదితరులు పాల్గొన్నారు.

కూర్మావతారంలో జగన్నాథుడు



కూర్మావతారంలో భక్తులకు దర్శనం



కూర్మావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథ స్వామి



పూజలు చేస్తున్న అర్చకుడు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కశింకోట: దేవాదాయ శాఖకు చెందిన స్థానిక రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు శనివారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. విష్ణుమూర్తి దశావతారాల్లో రెండో అవతారంగా స్వామిని అలంకరించి సుభద్ర, బలభద్రస్వాములతోపాటు పూజలు నిర్వహించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. భక్తులు పూజా ద్రవ్యాలను సమర్పించి ఎక్కువ సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి, రామచరణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గూడ్స్ రోడ్ ఇంద్రద్యుమ్న హాల్‌లో కొలువైన సుభద్ర బలభద్ర జగన్నాథస్వామి శనివారం భక్తులకు కూర్మావతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యన్నారాయణ, శ్రీరామ్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యే పూజలు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ కార్య నిర్వాహణాధికారి బి. మురళీకృష్ణ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

నేడు ఉచిత ఎముకల పరీక్షలు

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం ఉదయం 9 గంటలకు ఆరోగ్య ఆర్థోపెడిక్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత ఎముకల పటుత్వ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు క్లినిక్ వైద్యుడు గుండా సుధీర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.2 వేలు విలువ చేసే పరీక్షలు రోగులకు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోగులు ముందుగా వైద్య శిబిరం వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8328380460, 8978495060 నంబర్లను సంప్రదించాలన్నారు.

నూతన డీటీకి శుభాకాంక్షలు



డీటీకి శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌వోలు

పరవాడ: స్థానిక డిప్యూటీ తహసీల్దారుగా ఎం.ఎస్. అరుణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీటీగా పని చేసిన సురేష్‌కుమార్ అనకాపల్లి కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో పని చేసిన అరుణ్‌కుమార్ బదిలీపై పరవాడ డీటీగా వచ్చారు.

కొనసాగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు



దివ్య అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న వారాహి అమ్మవారు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు శనివారం ఉత్సవమూర్తి వారాహి అమ్మవారికి క్షీరాభిషేకం, శోడషోపచార సహిత కుంకుమ పూజలు నిర్వహించారు. వారాహి మాతను భూ ఆధారిత పంటలైన దాన్యతల్పం మీద దివ్య అలంకరణ భూషితగా నూతన వస్త్రాలతో ఆలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శుక్రవారం రాత్రి లక్ష్య సాధన కోసం లక్ష్య వారాహీ హోమం నిర్వహించగా శనివారం రాత్రి స్వప్నవారాహీ హోమం నిర్వహించారు. ఈ హోమంలో పాల్గొనడం ద్వారా వారాహీ మాత మనకు స్వప్నంలో దర్శనమిచ్చి అమూల్యమైన సూచనలు చేస్తుందని భక్తుల విశ్వాసం. అదే విధంగా ఆదివారం రాత్రి తిరస్కరిణీ వారాహీ హోమం జరుగుతున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఈ హోమం ద్వారా మాయా, భ్రాంతుల తొలగింపుతో పాటు ప్రతికూల శక్తుల నుండి రక్షణ కలగుతుందన్నారు. మధ్యాహ్నం గురుమాత అన్నపూర్ణ చేతుల మీదగా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

ఆక్రమణల్లోని భూముల సర్వే

మాకవరపాలెం: రాచపల్లి రెవెన్యూలో ఆక్రమణల్లో ఉన్న ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. ఈ రెవెన్యూలోని 737 సర్వే నంబర్‌లో 1500 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని 40 ఏళ్ల నుంచి చుట్టుపక్కల గ్రామాల రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇందులో 600 ఎకరాలు ప్రభుత్వ అవసరాలకు వినియోగించనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో రైతుల ఆక్రమణల్లో భూములను వీఆర్వోలు, సర్వే అసిస్టెంట్లు శనివారం నుంచి సర్వే చేస్తున్నారు. సర్వే నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు వీఆర్వో సాంబశివరావు తెలిపారు.

పీవీ సేవలు చిరస్మరణీయం

యలమంచిలి రూరల్: తొలి తెలుగు ప్రధాని, గొప్ప ఆర్థిక సంస్కరణవేత్త, బహు భాషా కోవిదుడు పీవీ నరసింహారావు అని స్థానిక గాయత్రీ సేవా ట్రస్టు ప్రతినిధులు రాచకొండ పట్టాభిరామయ్య, పెద్దింటి సూర్యనారాయణ మూర్తి అభిప్రాయపడ్డారు. భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా యలమంచిలి పట్టణంలోని ప్రధాన రహదారి పక్కనున్న పీవీ విగ్రహానికి ట్రస్టు ప్రతినిధులు, సీనియర్ సిటిజన్లు, ప్రముఖులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలను తీసుకొచ్చి దేశం ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకోవడానికి బాటలు వేసిన మహోన్నత వ్యక్తి పీవీ అని కొనియాడారు. ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఛార్టర్డ్ అకౌంటెంట్ బీఎస్ బంగారుశెట్టి, బొద్దపు శ్రీను, ఊటకూటి రమేష్, కొఠారు శ్రీను, డాక్టర్ సుతరపు శ్రీకాంత్, ఆనివెళ్ల శ్రీనివాసశర్మ, అప్పెపు గుప్తా, శిష్టా సన్యాసిరావు, సర్వేశ్వరరావు మాస్టారు, పిట్టా శ్రీను, గంధం శివ పాల్గొన్నారు.